సాక్షి సిద్దిపేట

సోమవారం : 18 : డిసెంబర్ : 2023



మృతదేహాల కలకలం

హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతాల్లో తరచూ మృతదేహాలు లభ్యమవుతున్నాయి. మహిళలు, యువతుల మృతదేహాలు కుళ్లిన స్థితిలో కనిపిస్తున్నాయి. వివరాలు 8లో ▸



కర్ణాటకనే దిక్కు!

జహీరాబాద్‌లోని 'ట్రైడెంట్' యాజమాన్యం క్రషింగ్‌ను చేపట్టే పరిస్థితి కనిపించకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో రైతులు పక్క రాష్ట్రాలకు చెరకును తరలిస్తున్నారు. వివరాలు 8లో ▸



సహ చట్టం.. నిర్లక్ష్యానికే పట్టం!

ప్రభుత్వ పాలనా విధానాలను ప్రజల ముందు ఉంచేందుకు కల్పించిన సమాచార హక్కు చట్టం నిర్లక్ష్యానికి గురవుతోంది. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

చర్లఅంకిరెడ్డిపల్లి సర్పంచ్‌కు జాతీయ అవార్డు



అవార్డు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న సాహిత్య అకాడమి నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చర్లఅంకిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ రాజబోయిన స్వర్ణలత ఉత్తమ జాతీయ అవార్డుకు ఎంపికయ్యారని బహుజన సాహిత్య అకాడమి జాతీయ కమిటీ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ప్రకటించారు. అవార్డు ఆహ్వాన పత్రాన్ని ఆదివారం హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమి జాతీయ కార్యాలయంలో సర్పంచ్ స్వర్ణలతకు అందజేశారు. ఫిబ్రవరి 11న ఏపీలోని తిరుపతిలో నిర్వహించే బహుజన రైటర్స్ 7వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌లో అవార్డు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. జాతీయ స్థాయిలో అవార్డు రావడంపై సర్పంచ్ స్వర్ణలత హర్షం వ్యక్తం చేశారు.

'ఎస్సీ వర్గీకరణపై కాలయాపన తగదు'

మిరుదొడ్డి(దుబ్బాక): కమిటీల పేరుతో కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లుపై కాలయాపన చేయడం సరికాదని దండోరా జిల్లా ఇన్‌ఛార్జి ముత్యాల భూపాల్ అన్నారు. ఆదివారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును కమిటీల పేరుతో కేంద్రం కాలయాపన చేయకుండా ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. జస్టిస్ రామచంద్ర కమిషన్ 1997, ఉషా మెహరా కమిషన్ 2008లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడి పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టాలన్నారు.

బోధి స్కూల్‌కు ఎక్సలెంట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న బోధి స్కూల్ కరస్పాండెంట్ భాస్కర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని బోధి స్కూల్‌కు జాతీయ స్థాయిలో బ్రెయిన్ ఫీడ్ ఎక్సలెంట్ అవార్డు వచ్చినట్లు పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్ ఆదివారం తెలిపారు. శనివారం రాత్రి హైదరాబాదులోని హైటెక్ సిటీ ఎగ్జిబిషన్‌లో బ్రెయిన్ ఫీడ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. అత్యుత్తమ విద్యా ప్రమాణాలను, సాంకేతిక బోధనలను ప్రామాణికంగా తీసుకుని ఈ అవార్డు ప్రదానం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మల్లిక, బ్రెయిన్ ఫీడ్ సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారన్నారు.



నాచగిరీశుని దర్శించుకుంటున్న భక్తులు

నాచగిరి.. ఆధ్యాత్మిక ఝరి

నాచగిరి లక్ష్మీనృసింహ క్షేత్రంలో ధనుర్మాసోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మూల విరాట్లులకు విశేష అభిషేకం నిర్వహించారు. పూల మాలికలు, పట్టువస్త్రాలు, సర్వాభరణాలతో స్వామి వార్లను కమనీయంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ద్రావిడ ప్రబంధ పారాయణం, తిరుప్పావై కాలక్షేపం జరిగింది. సెలవురోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పలువురు దంపతులు సత్యదేవుని వ్రతమాచరించి మొక్కులు తీర్చుకున్నారు. - వర్గల్(గజ్వేల్)



విశేషాలంకరణలో లక్ష్మీనారసింహులు



ఆలయ రాజగోపురం ఎదుట భక్తులు

భక్తుల తాకిడి.. పట్నాల సందడి

కొమురవెల్లి మల్లికార్జున ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మల్లన్న మమ్మేలు స్వామి అంటూ భక్తులు చేసిన నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. గంగిరేణి చెట్టు వద్ద ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఏర్పాట్లను ఆలయ ఈవో, సిబ్బంది పర్యవేక్షించారు. - కొమురవెల్లి(సిద్దిపేట)



పట్నాలు వేస్తున్న భక్తులు

గడా.. భవితవ్యంపై దడా!



గజ్వేల్ పట్టణం..

తొమ్మిదిన్నరేళ్లుగా చెరగని ముద్ర

- గజ్వేల్ అభివృద్ధిలో కీలకం
- మారిన ఈ ప్రాంత రూపురేఖలు
- రద్దయ్యే అవకాశం ఉండటంతో సర్వత్రా చర్చ
- కేసీఆర్ ఓఎస్డీగా ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి!
- త్వరలోనే అధికారిక ప్రకటన?

గజ్వేల్: తొమ్మిదిన్నరేళ్లుగా గజ్వేల్ అభివృద్ధిలో చెరగని ముద్ర వేసుకున్న మాజీ సీఎం కేసీఆర్ మానసపుత్రిక 'గడా' (గజ్వేల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) భవితవ్యంపై అంతటా చర్చ కొనసాగుతోంది. ప్రభుత్వం మారిన తరుణంలో ఈ అథారిటీ రద్దయ్యే అవకాశముండగా, ఇక ముందు నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి సేవలందుతాయోననే అంశం కూడా తెరపైకి వస్తున్నది.

2014 సాధారణ ఎన్నికల్లో సెంటిమెంట్‌గా గజ్వేల్ నియోజకవర్గాన్ని ఎంచుకున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. అనుకున్నట్లుగానే ఇక్కడ గెలుపొందగా.. రాష్ట్రంలోనూ అప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడింది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్.. గజ్వేల్‌ను దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి సంకల్పించారు. ఇందుకోసం 'గడా'(గజ్వేల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ)ని ఏర్పాటు చేశారు. సీఎంగా నిత్యం నియోజకవర్గ ప్రజలను కలిసే అవకాశం లేనందువల్ల తన ప్రతినిధిగా సేవలందించడానికి 'గడా'కు ప్రత్యేకాధికారిగా అప్పట్లో హన్మంతరావును నియమించారు. కేసీఆర్ ఆశించినట్లుగానే 'గడా' గజ్వేల్ అభివృద్ధికి సోపానంగా నిలిచింది. ఈ అథారిటీ ద్వారా నిధుల వరదతో నియోజకవర్గానికి కొత్త రూపు వచ్చింది. కేసీఆర్ చొరవ ఫలితంగా కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్, రైల్వేలైను, ములుగులో హార్టికల్చర్ యూనివర్సిటీ, ఫారెస్ట్రీ కళాశాల, తున్కిబొల్లారం, చిన్నతిమ్మాపూర్, వర్గల్, ములుగు మండలాల్లో టీఎస్ఐఐసీ ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటు, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో రింగు రోడ్డు, ఎడ్యుకేషన్ హబ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మహతి ఆడిటోరియం, ఐఓసీ (ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్), అర్బన్‌పార్కు, పాండవుల చెరువు సుందరీకరణ తదితర భారీ అభివృద్ధి పనులు జరిగాయి. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశారు. ఈ అభివృద్ధి పనుల పర్యవేక్షణలో 'గడా' కీలక భూమిక వహించింది. ఈ అథారిటీకి 2014నుంచి 2018 చివరి వరకు హన్మంతరావు ఓఎస్డీగా పనిచేశారు. ఆ తర్వాత సిద్దిపేట డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న ముత్యంరెడ్డిని ప్రత్యేకాధికారిగా నియమించారు. ఆయన పదవీ కాలం ముగిసిన తర్వాత రెండుసార్లు పొడిగించారు. ప్రస్తుతం ఆయనే కొనసాగుతున్నారు. ప్రత్యేకాధికారిగా 2024 ఆగస్టు వరకు కూడా ఆయనకు పదవీ కాలం ఉంది. కానీ ప్రభుత్వం మారటం వల్ల 'గడా' రద్దయ్యే అవకాశముండటంతో నియోజకవర్గంలో అంతటా ఈ అంశంపై చర్చ కొనసాగుతున్నది. ఇటీవలి కాలం వరకు కూడా నియోజకవర్గంలో ఏదైనా సమస్య ఉంటే నేరుగా 'గడా' కార్యాలయానికి వెళ్లి చెప్పుకున్న సాధారణ ప్రజలు, నాయకులు, ప్రజాప్రతినిధులకు ఇక ఈ అవకాశం ఉన్నది. నేడు భిన్నమైన పరిస్థితి ఏర్పడింది.

కేసీఆర్ ఓఎస్డీగా..



ముత్యంరెడ్డి 'గడా' ప్రత్యేకాధికారి

తాజా ఎన్నికల్లో మూడోసారి గజ్వేల్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన కేసీఆర్ ప్రస్తుతం బీఆర్ఎస్ఎల్‌పీ నేతగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలోనే 'గడా' ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి కేసీఆర్ ఓఎస్డీగా పనిచేస్తారనే ప్రచారం జరుగుతున్నది. నిన్నటిమొన్నటి వరకు 'గడా' ప్రత్యేకాధికారిగా నియోజకవర్గంలోని ప్రజలకు, నాయకులకు, ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉండి సేవలందించిన ముత్యంరెడ్డి ప్రస్తుత పరిస్థితుల్లోనూ కేసీఆర్ ఓఎస్డీ పనిచేస్తూ పాత విధానంలోనే ఇక్కడి ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలుస్తోంది. గతంలో మాదిరిగానే తన దృష్టికి వచ్చిన సమస్యలను కేసీఆర్ వద్దకు తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తారని సమాచారం. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనున్నదని తెలుస్తోంది.



మంత్రి శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు

గ్యారంటీగా హామీల అమలు

- ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- మంత్రిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేటఅర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన ప్రజలకు అందేలా పార్టీ నాయకులు కృషి చూడాలని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. ఆదివారం సిద్దిపేటలోని హరిత హోటల్ వద్ద పార్టీ నాయకులు మంత్రిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని, ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు వారధిగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమాం, తాడూరి శ్రీనివాస్, దరిపల్లి చంద్రం, బొమ్మల యాదగిరి, గయాజుద్దీన్, వంగరి నాగరాజు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

- ఎవరికి ఏ ఆపద వచ్చినా ఆదుకుంటాం
- ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: కార్యకర్తల కష్ట సుఖాల్లో అండగా ఉంటామని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం దుబ్బాక మండలం చీకోడ్ ఎంపీటీసీ ఎల్.రాంరెడ్డి నూతన గృహప్రవేశం కార్యక్రమంతో పాటు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సూచనల మేరకు నడుచుకుంటూ ముందుకు సాగుతున్న పార్టీ శ్రేణులను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. తాము అధికారంలోకి రాలేదని కార్యకర్తలు బాధపడవద్దని భవిష్యత్తులో మనమే మళ్లీ అధికారంలోకి వస్తామన్నారు. రాజకీయాల్లో పదవులు ఎప్పుడూ శాశ్వతం కావని మనం చేసిన మంచి పనులే ప్రజల గుండెల్లో నిలిచిపోతాయన్నారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా మా దృష్టికి తేవాలని వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొత్త పుష్పలత, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.



అక్కారం గ్రామంలో మృతుడు రవీందర్ ఇంటి ఎదుట ఆందోళనకు దిగిన బాధితులు

సన్‌పరివార్ బాధితుల ఆందోళన

- రవీందర్ మృతదేహం తరలించేదిలేదంటూ నిరసన
- పోలీసుల జోక్యంతో ఆందోళన విరమణ

గజ్వేల్‌రూరల్: సన్ పరివార్, పుడమి సంస్థల నిర్వాహకుడు మెతుకు రవీందర్ గుండెపోటుతో మృతి చెందగా.. అతను నిర్వహించిన వ్యాపారాల్లో మోసపోయిన బాధితులు ఆందోళనకు దిగారు. ఈ సంఘటన ఆదివారం గజ్వేల్ మండలం అక్కారం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అక్కారం గ్రామానికి చెందిన మెతుకు రవీందర్ సన్ పరివార్‌తో పాటు పుడమి సంస్థలను ఏర్పాటు చేసి వందలాది మంది నుంచి పెట్టుబడుల రూపంలో డబ్బులను వసూలు చేశారు. ఈ సంస్థల మోసాలు బయటపడడంతో ఈడీ అధికారులు పలు దఫాలుగా ఆయా సంస్థలపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశాయి. ప్రస్తుతం ఈ కేసులు కోర్టులో ఉండగా.. మెతుకు రవీందర్ గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఆయా సంస్థలలో పెట్టుబడులు పెట్టిన గజ్వేల్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన బాధితులతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన బాధితులు వందలాది మంది రవీందర్ స్వగ్రామమైన అక్కారానికి చేరుకున్నారు. ఈ క్రమంలో అంత్యక్రియలు నిర్వహించకుండా రవీందర్ మృతదేహం ఉండగానే తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేదిలేదంటూ మృతుని ఇంటి ఎదుట బాధితులు భీష్మించి కూర్చున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కారానికి చేరుకొని బాధితులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కాగా కోర్టులో కేసు కొనసాగుతున్న నేపథ్యంలో వచ్చిన తీర్పు మేరకు బాధితులకు సహకరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని మృతుడు రవీందర్ భార్య హేమలత ఒప్పంద పత్రం రాసివ్వడంతో బాధితులంతా అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం రాత్రి 9గంటల సమయంలో రవీందర్ అంత్యక్రియలను నిర్వహించారు.

సీపీ శ్వేత బదిలీ



సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత బదిలీ అయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం నుంచి ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. సీపీ శ్వేతను హైదరాబాద్ డిటెక్టివ్ డిపార్ట్‌మెంట్‌కు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సీపీ శ్వేత సిద్దిపేట పోలీసు కమిషనర్‌గా 2021 డిసెంబర్ 28న బాధ్యతలు చేపట్టింది. పోలీసు కమిషనర్‌గా విధి నిర్వహణలో జిల్లాలో తన మార్క్‌ను చూపారు. సీపీ శ్వేత బదిలీ కావడంతో సిద్దిపేట నూతన సీపీగా నూతన అధికారి రానున్నారు. నూతన సీపీగా ఎవరూ రానున్నారని జిల్లా పోలీసు అధికారులు, ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

నవోదయం.. అపూర్వం

విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- వర్గల్ నవోదయలో పండుగ వాతావరణం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు





నవోదయ విద్యార్థుల నృత్యప్రదర్శన

వర్గల్(గజ్వేల్): వారందరూ నవోదయ పూర్వవిద్యార్థులు.. ఒక్కొక్కరు ఒక్కో రంగంలో స్థిరపడ్డారు. ఉద్యోగాలు చేసుకుంటూ, వ్యాపారాలు నిర్వహిస్తూ వివిధ వ్యాపకాలలో మునిగిపోయిన వారందరూ ఆదివారం వర్గల్ నవోదయ విద్యాలయం వేదికగా అల్యూమినీ డే(పూర్వవిద్యార్థుల సమ్మేళనం)లో భాగస్వాములయ్యారు. నాటి మిత్రులను పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుంటూ, కుటుంబసభ్యులను పరిచయం చేసుకుంటూ, యోగక్షేమాలు తెలుసుకుంటూ, పాత జ్ఞాపకాలు నెమరేసుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. తమకు విద్య నేర్పిన అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. తమకు ఆత్మీయ స్వాగతం పలికిన నవోదయ విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. వారికి ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.



పూర్వవిద్యార్థులకు విన్నర్ కప్పు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రాజేందర్

ప్రిన్సిపాల్ అధ్యక్షతన..

దాదాపు 250 మంది పూర్వవిద్యార్థులు భాగస్వాములైన అల్యూమినీ డే మహా సమ్మేళనానికి ప్రిన్సిపాల్ రాజేందర్ అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి. పూర్వవిద్యార్థులు సైతం ఆటలు, పాటలతో సరదాగా గడిపారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థుల సంఘ అధ్యక్షుడు వడ్ల రామకృష్ణ సంఘ కార్యక్రమాలు వివరించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న పలువురికి ఆర్థిక సాయం, వైద్య సహాయం అందించామన్నారు. ప్రస్తుత విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌లోనూ, వారి అభివృద్ధిలోనూ తమ సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని భరోసా ఇచ్చారు. శ్రీమేరు హాస్పిటల్ సీఈవో వెంకటరెడ్డి మాట్లాడుతూ తాను ఎప్పటికీ నవోదయ విద్యార్థినే అని, నవోదయ విద్యార్థులకు ఎలాంటి కష్టం వచ్చినా అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. ప్రిన్సిపాల్ రాజేందర్ మాట్లాడుతూ నవోదయలో చదివిన ప్రతి విద్యార్థి సమాజాభివృద్ధి, దేశాభివృద్ధికి దోహదపడేలా ఎదగాలని ఆకాంక్షించారు. అల్యూమిని డే సందర్భంగా పూర్వవిద్యార్థులు భారీ సంఖ్యలో హాజరవడం సంతోషం కలిగిస్తుందన్నారు. సమ్మేళనంలో సంఘ ప్రతినిధులు నిరుప పటేల్, సాయిప్రేం, కుమార్, శ్రీపాద్‌రాం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అధైర్యపడొద్దు

మృతుల కుటుంబాలకు మాజీ మంత్రి హరీశ్‌రావు భరోసా



కానిస్టేబుల్ నరేశ్ తల్లిదండ్రులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామునిపట్లలో ఇటీవల ఏఆర్ కానిస్టేబుల్, కలెక్టర్ గన్‌మెన్ అకుల నరేశ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఆదివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు కానిస్టేబుల్ కుటుంబాన్ని పరామర్శించి, తల్లిదండ్రులను ఓదార్చారు. ఈ సంఘటన తీవ్రంగా కలిచివేసిందన్నారు. అధైర్యపడొద్దని, మీ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే మాచాపూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రాజారెడ్డి కుమారుడు ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఆయనతోపాటు బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ తదితరులు ఉన్నారు.

కాల కృత్యాలకు వెళ్లి.. చెరువులో శవమై




కనకవ్వ(ఫైల్)

దుబ్బాకరూరల్: కాల కృత్యాలకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళ మృతి చెందిన ఘటన అక్బర్‌పేట భూంపల్లి మండలం చిన్ననిజాంపేట గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ భువనేశ్వర్‌రావు తెలిపిన వివరాలు.. శేర్వపురం కనకవ్వ(35) ఈనెల 16న పోతారెడ్డిపేట గ్రామ శివారులోని పెద్ద చెరువులోకి కాలకృత్యాలకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోయింది. ఆదివారం కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్తుండగా చెరువులో కనకవ్వ మృతదేహాన్ని గుర్తించారు. మృతురాలు తల్లి ఎల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆరోగ్యం బాగా లేదని..

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య



మౌనిక(ఫైల్)

దుబ్బాకరూరల్: ఆరోగ్యం బాగా లేకపోవడంతో మనస్తాపానికి గురైన వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన అక్బర్‌పేట భూంపల్లి మండలం చౌదర్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. కొండపాక మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన బండారి మౌనిక(28)ను ఐదేళ్ల కిందట చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన మహేశ్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మౌనిక 20 రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతుంది. ఏదైనా పని చేసుకుందామన్నా ఆరోగ్యం సహకరించకపోవడంతో పది రోజుల కిందట తల్లిగారింటికి వెళ్లింది. మూడు రోజులు అక్కడే ఉండి తిరిగి చౌదర్‌పల్లికి వచ్చింది. తన పెద్దక్కయ్య లక్ష్మికి ఫోన్ చేసి ఆరోగ్యం బాగా లేదని ఆస్పత్రికి వెళ్లినా ఫలితం లేదని చెబుతూ బాధ పడుతుండేది. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి వెనుక గదిలో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కూతురు మృతిపై ఎలాంటి అనుమానం లేదని ఆదివారం మృతురాలి తల్లి బాలవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మృతదేహాల కలకలం

- అటవీ ప్రాంతాల్లో తరచూ లభ్యం
- హత్యలు చేసి పారేస్తున్న వైనం
- గుర్తు పట్టలేని స్థితిలో మృతదేహాలు
- పోలీసులకు సవాలుగా మారుతున్న కేసులు
- హైదరాబాద్‌కు సమీపంలో ఉండడమే కారణం?



జిన్నారం మండలంలోని కాజిపల్లి అటవీ ప్రాంతంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

జిన్నారం(పటాన్‌చెరు): హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతాల్లో తరచూ మృతదేహాలు లభ్యమవుతున్నాయి. మహిళలు, యువతులు, వ్యక్తుల మృతదేహాలు కుళ్లిన స్థితిలో కనిపిస్తున్నాయి. నిత్యం ఏదో ఒక చోట మృతదేహం దొరుకుతుండడంతో పోలీసులకు సవాలుగా మారింది. ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

హైదరాబాద్‌కు సమీపంలో జిన్నారం మండలంలోని బొల్లారం, గడ్డపోతారం, ఖాజీపల్లి, జిన్నారం మంగంపేట, సోలక్‌పల్లి గ్రామాలు, హత్నూర మండల పరిధిలోని రొయ్యపల్లి, నాగారం, వడ్డెపల్లి, షేర్‌ఖాన్‌పల్లి గ్రామాలు, గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి, మంబాపూర్, నల్లవల్లి, కొత్తపల్లి, కొత్తపల్లి తండా గ్రామాలు ఉన్నాయి. మెదక్ జిల్లా నర్సాపూర్ అటవీ ప్రాంతం వేల హెక్టార్‌లో విస్తరించి ఉంది. హైదరాబాద్ నుంచి నర్సాపూర్ వరకు ప్రధాన రహదారి ఉంది. ఈ రోడ్డుపై ప్రతీనిత్యం వేల సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో మహిళలు, యువతులను హత్యలు చేసి అటవీ ప్రాంతాల్లోకి తీసుకొచ్చి కాల్చి పడేస్తున్నారు. ఇలాంటి కేసులు తరచూ వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. వీటిని ఛేదించడం పోలీసులకు పెద్ద సవాలుగానే మారింది.

- రెండేళ్ల కిందట నల్లవల్లి అటవీ ప్రాంతంలో ఓ మహిళ మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా చేసి డబ్బాల్లో తీసుకొచ్చి నల్లవల్లి అటవీ ప్రాంతంలో పడేశారు. అప్పట్లో ఈ ఘటన సంచలనం రేపింది.
- దుండిగల్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తిని హత్య చేసి మాదారం అటవీ ప్రాంతంలో పడేశారు. వారం రోజుల తర్వాత సమీపంలోని ప్రజలు చూడడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన ఏడాది క్రితం జరిగింది.
- రెండేళ్ల కిందట ఇతర ప్రాంతంలో హత్య చేసిన వ్యక్తిని బొల్లారం సమీపంలోని రింగురోడ్డు ప్రాంతంలో పడేశారు.
- ఖాజీపల్లి అటవీ ప్రాంతాల్లో ఇప్పటి వరకు ఇలాంటి ఘటనలు మూడు జరిగాయి.
- ఆయా అటవీ ప్రాంతాల్లో పలువురు మహిళలు, యువకులు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఇవి హత్యలా, ఆత్మహత్యాలా తెలియరాలేదు.
- మూడు నెలల కిందట ఓ మహిళ మృతదేహాన్ని మంబాపూర్ అటవీ ప్రాంతంలో పడేసి కాల్చి హత్య చేశారు.
- తాజాగా జిన్నారం మండలంలోని మంగంపేట శివారులోని అటవీ ప్రాంతంలో ఓ మహిళ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు.
- నాగారం, రొయ్యపల్లి, నర్సాపూర్ ప్రాంతాల్లో కూడా తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి.

లోపించిన నిఘా

ప్రధాన రహదారులపై పోలీసుల నిఘా లోపించింది. నామమాత్రంగా వాహనాలను తనిఖీ చేస్తున్నారు. రాత్రి సమయంలో నిఘా లోపించడంతో నిందితులు దర్జాగా వారి పనులు చేసుకుంటున్నారు. సీసీ కెమెరాల పనితీరు కూడా సరిగా లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. తగిన నిఘా, భయం లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, వీటిని నివారించేలా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

> **కేసులను ఛేదిస్తున్నాం**
>
> హత్య కేసులను ఛేదించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండేలా గట్టి నిఘా ఏర్పాటు చేశాం. హత్యలు చేసే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. సీసీ కెమెరాల పని తీరును మరింత మెరుగు పర్చేలా చూస్తున్నాం.
>
> – వేణుకుమార్, సీఐ జిన్నారం

జోన్ మార్పు కోసం కృషి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



సునీతారెడ్డిని సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

నర్సాపూర్: మెదక్ జిల్లాను సిరిసిల్ల జోన్ నుంచి తీసి చార్మినార్ జోన్‌లో చేర్పించేందుకు తన వంతు కృషి చేస్తానని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఆదివారం పీఆర్‌టీయూ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సామ్యానాయక్‌తోపాటు సంఘం నాయకులు పలువురు సునీతారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాను సిరిసిల్ల జోన్ నుంచి మార్పు చేసి చార్మినార్ జోన్‌లో చేర్చే విధంగా చూడాలని వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుల వినతిపై సునీతారెడ్డి స్పందిస్తూ జోన్ మార్పు కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అసెంబ్లీలో జీరో అవర్‌లో తనకు మాట్లాడేందుకు అవకాశం వస్తే తప్పకుండా జోనల్ మార్పు కోసం మాట్లాడుతానని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి సైతం లేఖ అందజేసి జోనల్ మార్పు చేయాలని కోరుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు సామ్యానాయక్‌తోపాటు జిల్లా, మండల సంఘం బాధ్యులు చందర్, స్వరూపరాణి, ధన్‌సింగ్, ప్రసన్నకుమార్, రమేశ్, సత్యనారాయణ, వెంకటస్వామి, శ్రీనివాస్, భీమ్లా, పంతులు, ఇంతియాజ్, జేత్య, రాజు, రేగం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మరొకరికి తీవ్ర గాయాలు



సత్తయ్య మృతదేహం

శివ్వంపేట(నర్సాపూర్): బైక్ అదుపుతప్పి కింద పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన గోమారం–సికింద్లాపూర్ ప్రధాన రోడ్డుపై ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి పెద్దగొట్టిముక్ల గ్రామానికి చెందిన గంగన్నగారి సత్తయ్య(52), చాకలి బాలవీరయ్య బైక్ పై పని నిమిత్తం మనోహరాబాద్ మండలం కాళ్లకల్ వెళ్లారు. అనంతరం ఇంటికి తిరిగి వస్తుండగా గోమారం గ్రామ శివారులో మలుపు వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ఘటనలో గంగన్నగారి సత్తయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. బాలవీరయ్యకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు 108 అంబులెన్స్‌లో నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య యశోద, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సీపీఎస్ రద్దు, డీఏల చెల్లింపుపై హర్షం



మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

మనోహరాబాద్(తూప్రాన్): తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 10 ఏళ్లలో ఉద్యోగ ఉపాధ్యాయులు ఎన్నో కష్టాలను, నష్టాలను చూశారని ఎస్టీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ చిరకాల కోరికైన సీపీఎస్ రద్దును చేస్తామనడం, పెండింగ్ డీఏలు విడుదల చేస్తామనడం, పీఆర్సీ ప్రకటించి అమలు చేస్తామని చెప్పడం శుభ సూచకమన్నారు. నిజానికి తెలంగాణ ప్రజలకు ఇప్పుడే స్వేచ్ఛ లభించిందని, సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని సమస్యలు పరిష్కారం కావాలని ఆయన కోరారు. ఈ విషయంపై జిల్లా కార్యదర్శి అశోక్ సైతం ఎస్టీటీయూ మెదక్ జిల్లా పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రాథమిక విద్య ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కారం చేయాలని, 317 సమస్యలు పరిష్కరించి, వేసవి సెలవుల్లో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు.

కర్ణాటకనే దిక్కు!

- 'ట్రైడెంట్'లో ఊసేలేని చెరకు క్రషింగ్
- రూ.9 కోట్ల బకాయిల చెల్లింపులో జాప్యం
- విధిలేక పక్క రాష్ట్రానికి తరలిస్తున్న రైతులు
- చించోళిలోని కర్మాగారానికి 8 వేల టన్నుల అగ్రిమెంట్?
- ఎన్నికల్లో ఇచ్చిన హామీని మరిచిన ప్రజాప్రతినిధులు



క్రషింగ్ చేపట్టక వెలవెలబోతున్న ట్రైడెంట్ యార్డు

జహీరాబాద్: జహీరాబాద్‌లోని 'ట్రైడెంట్' యాజమాన్యం క్రషింగ్‌ను చేపట్టే పరిస్థితి కనిపించకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో రైతులు పక్క రాష్ట్రాలకు చెరకును తరలిస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని ప్రజా ప్రతినిధులు మర్చిపోవడంతో రైతాంగం వారిపై ఆశలు వదులుకొని తమ దారి తామే చూసుకుంటున్నారు. ఇప్పటికే పలు కర్మాగారాలతో ఒప్పందం సైతం చేసుకున్నారు.

జహీరాబాద్ జోన్ పరిధిలో సుమారు 18 వేల ఎకరాల్లో చెరకు పంట సాగులో ఉంది. 7 లక్షల టన్నుల మేర చెరకు పంట ఉత్పత్తి కానుంది. ఇంత మొత్తంలో పంట జోన్ పరిధిలో ఉండడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు పక్కనే ఉన్న కర్ణాటకకు పంటను తరలిస్తున్నారు. కర్ణాటకలోని చించోళి, బరూర్, మన్నాక్కెల్లి, గాంధీ చక్కెర కర్మాగారాలకు పంటను పంపిస్తున్నారు. జహీరాబాద్ నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, యాజమాన్యంపై ఆశలు వదులుకొని ఇప్పటికే జోన్ పరిధిలో సాగులో ఉన్న దాంట్లో 8 వేల ఎకరాల పంటను పక్కనే ఉన్న కర్ణాటకలోని చించోళి యాజమాన్యంతో ఒప్పందం చేసుకున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. జోన్ పరిధిలోని జహీరాబాద్, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, మొగుడంపల్లి మండలాల్లో రైతులు చెరకు పంటను విస్తారంగా సాగు చేసుకున్నారు. కర్ణాటకలోని యాజమాన్యాలు టన్నుకు ధర రూ.2,650 మేర చెల్లించి, చెరకు కోత, రవాణా ఖర్చులను వారే భరిస్తున్నారని రైతులు పేర్కొన్నారు.

రూ.9 కోట్ల మేర బకాయి

'ట్రైడెంట్' కర్మాగారంలో 2022–23 క్రషింగ్ సీజన్‌కు గాను 2.55 లక్షల టన్నుల చెరకును గాను గాడించింది. టన్నుకు రూ.3,270 ధర నిర్ణయించింది. మొదటి విడత కింద టన్నుకు రూ.3 వేల వంతున చెల్లిస్తూ వచ్చింది. మిగితా రూ.270 పెండింగ్ పెట్టింది. జనవరి నెలాఖరు, ఫిబ్రవరి మాసంలో చెరకును సరఫరా చేసిన రైతులకు మాత్రం పూర్తిస్థాయిలో బిల్లులు పడ్డాయి. జోన్ పరిధిలో ఉన్న మొత్తం 2,287 మంది రైతులు కర్మాగారానికి చెరకును సరఫరా చేశారు. ఇందులో 1,699 మంది రైతులకు టన్నుకు రూ.270 వంతున బకాయి పడింది. మిగిలిన రైతులకు పూర్తిస్థాయిలో బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. రూ.83 కోట్లకు గాను రైతాంగానికి ఇప్పటి వరకు రూ.74 కోట్ల మేర చెల్లించారు. ఇంకా రూ.9 కోట్ల మేర బకాయిలను చెల్లించాల్సి ఉందని రైతులు పేర్కొంటున్నారు.

ఇచ్చిన హామీని మరిచిన నేతలు

ఎన్నికల సందర్భంగా కర్మాగారంలో క్రషింగ్‌ను చేపట్టేలా చర్యలు తీసుకుంటామని, మొత్తం చెరకు బకాయిలు ఇప్పిస్తామని రైతులకు ప్రజా ప్రతినిధులు, అధికారులు హామీ ఇచ్చి మర్చిపోయారని రైతులు వాపోతున్నారు. పలు సమావేశాల్లో ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి దేవీప్రసాద్ హామీ ఇచ్చారని రైతులు పేర్కొంటున్నారు. అవసరం అయితే తమ ఆస్తులను అమ్మి బకాయిలు చెల్లిస్తామని మాట ఇచ్చారని, వారు ఇప్పుడు ఎక్కడికి పోయారని ప్రశ్నిస్తున్నారు. డిసెంబర్ మొదటివారంలోనే క్రషింగ్ జరిపేలా చూస్తామని చెప్పినట్లు గుర్తు చేస్తున్నారు.



కర్ణాటకకు చెరకు లోడ్‌తో వెళ్తున్న లారీ

> **అధికారులు హామీ ఇచ్చి..**
>
> 
>
> ఎన్నికల ప్రచారం నిమిత్తం నవంబర్ 23వ తేదీన జహీరాబాద్‌కు అప్పటి సీఎం కేసీఆర్ ప్రచారం నిమిత్తం వస్తుండడంతో సభను అడ్డుకునేందుకు రైతులంతా తీర్మానించారు. డిసెంబర్ మొదటి వారంలో బకాయిలను ఇప్పించడంతోపాటు క్రషింగ్‌ను జరిపిస్తామని ఎమ్మెల్యే మాణిక్‌రావు, కేస్, పోలీసు అధికారులు హామీ ఇచ్చి తమ ఆందోళనను విరమింపజేశారు. ఎన్నికలు ముగిసిన అనంతరం ఎవరూ పట్టించుకోవడం లేదు.
>
> –కొండల్‌రెడ్డి, రైతుసంఘం నాయకుడు, జహీరాబాద్

మైనార్టీల అభివృద్ధికి పెద్దపీట



మాట్లాడుతున్న మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్

నారాయణఖేడ్: మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ ఎంపీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సురేశ్ షెట్కార్ తెలిపారు. ఆదివారం నారాయణఖేడ్ సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో మైనార్టీ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మానసభలో ఎమ్మెల్యే సంజీవరెడ్డిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖేడ్ ప్రాంతంలో అనాదిగా హిందువులు, ముస్లింలు కలిసిమెలిసి ఉంటారని అన్నారు. మైనార్టీలకు స్వయం ఉపాధి కోసం రుణాలు, మైనార్టీ గురుకులాల్లో ఖాళీ ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, ఖేడ్ షాదీఖానా మరమ్మతులకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్, ఖేడ్ మాజీ సర్పంచ్ అప్పారావు షెట్కార్, మైనార్టీ నాయకులు రశీద్, తాహెర్‌అలీ, ముంతాజ్, మైనొద్దీన్, సుబూర్, రషీద్, దిల్‌దార్‌ఖాన్, వాజిద్, నజీర్, ఖాన్‌సాబ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరప్ప

సదాశివపేట(సంగారెడ్డి): విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని, విశ్రాంత ఉద్యోగులందరూ ప్రశాంత వాతావరణంలో శేషజీవితం గడపాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోడపల్లి శంకరప్ప పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయం ఆవరణలో జాతీయ పెన్షనర్స్ డే దినోత్సవం నిర్వహించారు. బోడపల్లి శంకరప్ప, కార్యదర్శి పండరీలతోపాటు ఎండి షర్ఫుద్దీన్, అంబటి విశ్వనాథం, కాశీనాథ్, బషీరుద్దీన్, చంద్రమౌళి, శివరాజయ్య, చింతా జనార్దన్, అశోక్‌కుమార్, తుల్జయ్యలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు చికూర్తి అంజయ్య, అశోక్‌కుమార్, చంద్రమౌళి, నాగారం పెంటయ్యలతోపాటు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రవణ నక్షత్ర మహోత్సవం

- వేంకటేశ్వరుడికి లక్ష తులసీ దళార్చన
- వర్గల్ క్షేత్రంలో భక్తిపారవశ్యం



తులసీ దళార్చనలో వేంకటేశ్వరుడు

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధమైన వర్గల్ శ్రీవిద్యాసరస్వతీ క్షేత్రంలోని వేంకటేశ్వరాలయంలో ఆదివారం శ్రవణ నక్షత్ర మహోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖరశర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో అర్చక వేదపండితులు తెల్లవారుజామున శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుడికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. అలంకార సేవ చేశారు. ఓ వైపు స్వామివారి నామార్చన కొనసాగుతుండగా వేద విద్యార్థులు, భక్తజనులు స్వామివారికి ఒక్కొక్కటిగా లక్ష తులసీదళాలు సమర్పించారు. నేత్రపర్వంగా సాగిన మహోత్సవంలో భక్తులు పాల్గొని తరించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు సుబ్రహ్మణ్య షష్టి వేడుకలు

వర్గల్ క్షేత్రంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్టి వేడుకలు ఘనంగా జరుగనున్నాయి. ఉదయం 6 గంటలకు శ్రీవల్లీదేవ సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేషాభిషేకం, 8 గంటలకు మూలమంత్ర హవనం, 10 గంటలకు అక్షరాభ్యాస మహామండపం వేదికగా శ్రీసుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణమహోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈ వేడుకల్లో భక్తులు పాల్గొని తరించాలని చంద్రశేఖరసిద్ధాంతి కోరారు.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

రూ.12.31 లక్షలు పోగొట్టుకున్న బాధితులు

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.8 లక్షలు 31 వేలు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ మండల పరిధిలోని సాయి భగవాన్ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్ టైం జాబ్ అంటూ వాట్సాప్ డిసెంబర్ 1 వ తేదీన మెసేజ్ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. సైట్ నిర్వాహకులు అతడికి ఒక వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. ఉద్యోగి ముందుగా రూ.3 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు. అతడు పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.8 లక్షల 31 వేలు చెల్లించాడు. సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదుతోపాటు కమీషన్ చూపించారు. కొద్దిరోజులకు ఉద్యోగి తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడుగగా స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గ్రహించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మరో ఘటనలో రూ.4 లక్షలు

అమీన్‌పూర్ పరిధిలోని వందనపురి కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ఈ నెల 1వ తేదీన జాబ్ ఆఫర్ అంటూ మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు తన వివరాలను నమోదు చేశాడు. ఇచ్చిన టాస్కులు పూర్తి చేస్తూ మొత్తం రూ.4 లక్షల పెట్టుబడి పెట్టాడు. చివరికి తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడుగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదివారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న శ్రీనివాస్

దౌల్తాబాద్(దుబ్బాక): ఎక్సెల్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన దౌల్తాబాద్ మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గాజులపల్లి గ్రామానికి చెందిన ల్యాగాల పండారి రెడ్డి, పంజ భూమయ్య ఇద్దరూ కలిసి గాజులపల్లి నుంచి ఎక్సెల్‌పై దౌల్తాబాద్‌కు పని కోసం వెళ్తున్నారు. దౌల్తాబాద్ మండల కేంద్రానికి సమీపంలో రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే వీరిని చికిత్స కోసం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గుర్తు తెలియని వాహనాన్ని పట్టుకునేందుకు దర్యాప్తు చేస్తున్నామని దౌల్తాబాద్ ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో..



గాయాలతో పండారిరెడ్డి

రామాయంపేట(మెదక్): ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం రామాయంపేటలో చోటు చేసుకుంది. కామారెడ్డి జిల్లా బిక్కనూర్ మండలం అంతంపల్లికి చెందిన జక్కుల శ్రీనివాస్ బైక్‌పై రామాయంపేట నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో కామారెడ్డి నుంచి రామాయంపేట వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌కు గాయాలు కాగా చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

స్పీకర్‌కు శుభాకాంక్షలు



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాకటౌన్: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికైన గడ్డం ప్రసాద్‌ను ఆదివారం దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కృత్రిమ అవయవాలతో కొత్త జీవితం



కృత్రిమ కాళ్లతో దివ్యాంగులు

ములుగు(గజ్వేల్): ఎంతో భవిష్యత్ కలిగి ఉండి వివిధ కారణాలతో అవయవాలు కోల్పోయిన వారికి కృత్రిమ అవయవాలు కొత్త జీవితాన్ని ప్రసాదిస్తాయని గజ్వేల్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు కుక్కల బాబుగౌడ్ అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో తెలంగాణ అమెరికా తెలుగు సంఘం సహకారంతో ములుగు, తూప్రాన్, గజ్వేల్ మండలాలకు చెందిన గోపమ్మ, నర్సింలు, శంకర్, వెంకటేష్, మైసయ్య అనే దివ్యాంగులకు వికారాబాద్‌లో ఆదివారం ఉచితంగా కృత్రిమ కాళ్లను అమర్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక సేవలో ముందుకు సాగుతున్న తమ క్లబ్ ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నర్సింహారెడ్డి, కోశాధికారి శ్రీనివాస్‌గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

హుస్నాబాద్: వరంగల్ శరత్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత ప్రారంభించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, ఎల్లమ్మ దేవాలయం ఆవరణ, ముదిరాజ్ సంఘ భవనంలో శిబిరం నిర్వహించారు. ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పెరుక భాగ్యరెడ్డి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కో ఆప్షన్ సభ్యులు శంకర్‌రెడ్డి, అయూబ్, మాజీ సర్పంచ్ డాక్టర్ కొంకట రవి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకు బస్సులు పునరుద్ధరించండి


హుస్నాబాద్: హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడం హర్షనీయమని, ఆయన నేతృత్వంలో హుస్నాబాద్ ప్రాంతంలో మారుమూల ప్రాంతాలకు గతంలో నడిచిన బస్సులను పునః ప్రారంభించాలని సాహిత్య సాంస్కృతిక సారధి అధ్యక్షుడు ముక్కెర సంపత్ కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. గతంలో హుస్నాబాద్ చుట్టుపక్కల గల అనేక మారుమూల ప్రాంతాలను అనుసంధానం చేస్తూ బస్సులు నడిచేవన్నారు. అప్పటి పాలకుల, అధికారుల నిర్లక్ష్యం మూలంగా అవి ఆగిపోయాయని తెలిపారు. హుస్నాబాద్ నుంచి చౌటపల్లి మీదుగా మంచినీళ్ల బండకు, జనగామ మీదుగా గుబ్బడి తదితర గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని మంత్రిని కోరారు.

ఎక్కడి చెత్త అక్కడే..



కేతకీ సంగమేశ్వర ఆలయ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర ఆలయ ఆవరణలో చెత్త సేకరణపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆలయానికి దర్శనార్థం తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. ఆలయ పరిసరాల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లడంతో ఇబ్బందులు పడుతున్నామని భక్తులు వాపోతున్నారు. అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

దుబ్బాక మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. పట్టణంలోని 16వ వార్డులో నూతన మురికి కాలువ నిర్మించడానికి అధికారులు గతంలో ఉన్న కాలువను కూల్చి అలాగే వదిలేశారు. దీంతో దోమలు పెరిగి వ్యాధుల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన మురికి కాలువ నిర్మించాలని కోరుతున్నారు. - దుబ్బాక



హరితం.. ఆహ్లాదం

మిరుదొడ్డి మండల పరిధిలోని ధర్మారంలో రోడ్డుకు ఇరువైపులా చెట్లు ఆహ్లాదం పంచుతున్నాయి. పచ్చని పందిరి వేసినట్లు చెట్లు అల్లుకుపోవడంతో దారి పొడవునా నీడ సంతరించుకుంటోంది. ప్రయాణికులకు పచ్చని చెట్లు స్వాగతం పలుకుతున్నాయి. పచ్చదనం సంతరించుకున్న రోడ్డుపై నడక తెలియకుండానే ఉత్సాహం నింపుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - మిరుదొడ్డి(దుబ్బాక)

సహ చట్టం.. నిర్లక్ష్యానికే పట్టం!

- బోర్డులో కానరాని అధికారుల పేర్లు
- చట్టాన్ని తుంగలో తొక్కిన వైనం

సిద్దిపేటఅర్బన్: ప్రభుత్వ పాలనా విధానాలను ప్రజల ముందు ఉంచేందుకు కల్పించిన సమాచార హక్కు చట్టం నిర్లక్ష్యానికి గురవుతోంది. ప్రభుత్వం అమలు చేసే ఏ పథకం గురించి అయినా సమాచారం ఇవ్వడం ప్రభుత్వ విధి.. అయితే దానిని పొందడం పౌరుల హక్కు. సామాన్య ప్రజల చేతిలో వజ్రాయుధంగా మారాల్సిన సమాచార హక్కు చట్టం అమలులో జరుగుతున్న లోపాల కారణంగా చట్టంపై విశ్వాసం కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గ్రామ పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు ఏ సమాచారం అయినా ఒక్క దరఖాస్తుతో పొందే అవకాశం ఆర్టీఐ చట్టం కల్పించింది. సహ చట్టాన్ని అమలు చేయడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.

సమాచార వెల్లడిలో వెనకడుగు..

సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4(1)బీ చట్టానికి గుండెకాయ లాంటిది. ఇందులో 17 అంశాలు ఉన్నాయి. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోని అధికారుల వివరాలు, వారి విధులు, నిర్వర్తించాల్సిన బాధ్యతలు, ఆయా కార్యాలయాలకు వస్తున్న నిధులు, వాటి ఖర్చు వివరాలు వంటివి ప్రభుత్వ యంత్రాంగమే స్వచ్ఛందంగా ప్రజలకు తెలియజేయాలనేది నిబంధన. సహ దరఖాస్తుల్లో 60 శాతం వరకు ఈ సెక్షన్ కింద వస్తున్నవే. ప్రజా సమాచార అధికారుల నిర్లక్ష్యంతో తమ కార్యాలయ సమాచారాన్ని సరైన విధంగా డిజిటలైజ్ చేయలేకపోతున్నారు. స్వచ్ఛందంగా సమాచారం వెల్లడించడంలో అధికారులు వెనుకడుగు వేస్తున్నారు.

అధికారుల సమాచారం కరువు..

ప్రభుత్వ శాఖల జిల్లా కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం అధికారులకు సంబంధించిన సమాచారం నోటీస్ బోర్డుల్లో పెట్టడం లేదు. ఉన్న చోట పాత అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లు ఉంటున్నాయి. అధికారులు మారినా బోర్డులు మార్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం సమాచార కమిషనర్లను నియమించకపోవడంతో చట్టం అమలులో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.



పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న సహ చట్టం బోర్డు

సద్వినియోగం చేసుకోవాలి



సిద్దిపేట మున్సిపాలిటీలో అవినీతికి సంబంధించి ఆధారాలతో అధికారులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోకపోగా తిరిగి బెదిరింపులకు గురిచేస్తున్నారు. అవినీతి రహిత పరిపాలన కావాలంటే ప్రశ్నించడం అవసరం. అందుకోసం సమాచార హక్కు చట్టాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– ఎండీ. షారుల్, కౌన్సిల్ ఫర్ ఆర్టీఐ వ్యవస్థాపక అధ్యక్షుడు

టీ తాగుతూ.. ముచ్చటిస్తూ..



కార్యకర్తలతో కలిసి టీ తాగుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి టీ తాగుతూ కార్యకర్తలతో కాసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. ఆదివారం నార్సింగి నుంచి దుబ్బాకకు వెళుతున్న క్రమంలో అక్బర్‌పేట– భూంపల్లి మండల కేంద్రంలో కాసేపు ఆగారు. పార్టీ కార్యకర్తలతో కలిసి రోడ్డు పక్కనే ఉన్న దుకాణంలో టీ తాగి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మోతె సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, నాయకులు ధర్మారం భిక్షపతి, ప్రతాప్, ఉల్లెంగెల నరేష్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

వైభవంగా దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో కనకదుర్గామాత అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయానికి ఎమ్మెల్యే రూ. 2 లక్షలు విరాళంగా అందించారు. దీంతో ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు.

గీతంలో అంతర్జాతీయ సదస్సు

పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో 'పర్యావరణ, సమాజం, పరిపాలనలో (ఈఎస్‌జీ) సమకాలీన సమస్యలు' అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును ఫిబ్రవరి 16, 17న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈఎస్‌జీ ప్రాముఖ్యత, పర్యావరణం, సమాజం, ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం గురించి అవగాహన పెంచడం ఈ సదస్సు లక్ష్యంగా పేర్కొన్నారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు జనవరి 31 లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 95429 78515 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వృథాగా 'భగీరథ' నీరు



మిషన్ భగీరథ నీరు వృథాగా పోతోంది. మండలంలోని తాటిపల్లి గ్రామ శివారులో ఆదివారం మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోవడంతో తాగునీరు దబ్బవాగులోకి పోతోంది. మునిపల్లి మండలంలోని తాటిపల్లి, పెద్దలోడి, గార్లపల్లి, చీలపల్లి, మక్తక్యాసారం, పిల్లోడి, రాయికోడ్ మండలంలోని ఆయా గ్రామాలకు భగీరథ పైపులైన్ ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. అయితే పైపు పగిలిపోవడంతో కొన్ని గ్రామాలు నీటి సరఫరాలో అవరోధం కలిగింది. సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులుచేసి ప్రజలకు తాగునీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు. - మునిపల్లి(అందోల్)

ఆదరణ ఫుల్.. బస్సులు నిల్



ఆటోలను ఆశ్రయిస్తున్న మహిళలు

కొండపాక(గజ్వేల్): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అమలు చేసిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం బాగానే ఉన్నప్పటికీ బస్సుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద రాజీవ్ రహదారిపై బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి ఎదురుచూస్తున్నారు. వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద నుంచి నిత్యం వివిధ పనుల నిమిత్తం కొండపాక, చేర్యాల, జనగామ పట్టణాల నుంచి ప్రజలు ఇక్కడికి వచ్చి హైదారాబాద్‌కు వెళ్తుంటారు. ఈ చౌరస్తా నుంచి ఆర్టీసీ బస్సుల్లో హైదారాబాద్, గజ్వేల్, తూప్రాన్ తదితర పట్టణాలకు వెళ్లేందుకు వేచి చూస్తారు. దీనికి తోడు ఇటీవల ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసింది. దీంతో మహిళలు ఎక్కువగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. సెలవు రోజుల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, వివిధ పనులపై వెళ్లే మహిళలు ఆర్టీసీ బస్సు కోసం సుమారు అరగంట నుంచి గంట పాటు వేచి చూస్తున్నామని చెబుతున్నారు. కనీస అవసరాలు తీర్చుకునేందుకు సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక ఆటోలను ఆశ్రయిస్తున్నామని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చేర్యాల, జనగామ పట్టణాల రూట్‌లో ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచడంతో పాటు టాయిలెట్స్, మూత్రశాలలు నిర్మించాలని కోరుతున్నారు.



అపూర్వ సమ్మేళనం

హుస్నాబాద్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1983–84 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పట్టణానికి చెందిన ఎస్‌ఆర్‌వి వి. నెట్ ఫౌండేషన్ అధినేత ఎర్రం రఘునందన్‌రెడ్డి ఆధ్వర్యంలో సమ్మేళనం నిర్వహించారు. పిల్లల యోగ క్షేమాలను అడిగి తెలుసుకుని ఆనందంగా గడిపారు.

సంక్షిప్త వార్తలు

◆ పరామర్శ



సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని తోర్నాలలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పీచర భాగ్యలక్ష్మి కుటుంబాన్ని ఆదివారం మాజీ మంత్రి హరీశ్‌రావు పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ శ్రీదేవి చందర్‌రావు, సీనియర్ నాయకులు బాలకిషన్‌రావు, సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.

◆ భూమి పూజ



మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని మర్మాముల అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ ప్రాంగణంలో ఎల్లమ్మ ఆలయ నిర్మాణ పనులకు ఆదివారం వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలత మల్లేశం భూమి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సొంత ఖర్చులతో ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరగిరి స్రవంతి పర్శరాములుగౌడ్, బీఆర్‌ఎస్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు మంద సుమన్, వార్డు సభ్యులు, అంబేద్కర్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

◆ సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని వల్లంపట్లలో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ ఆలేటి రజిత యాదగిరి ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

◆ ఆర్థిక సాయం

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని గురువన్నపేటలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నలుగురు మృతుల కుటుంబాలను ఆదివారం జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుమారుడు రాకేష్‌రెడ్డి పరామర్శించారు. ఈసందర్భంగా ఒక్కొక్క కుటుంబానికి రూ. 25 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మండల నాయకుడు మహదేవుని శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు చంద్రం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ నూతన కార్యవర్గం



హుస్నాబాద్: పట్టణంలోని మడేలేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో ఆదివారం పట్టణ రజక సంఘం యూత్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రజక యూత్ సంఘం అధ్యక్షుడిగా పున్న రవీందర్, ఉపాధ్యక్షుడిగా బసవరాజు కన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా పున్న రమేష్, కోశాధికారిగా రమేష్, సహాయ కార్యదర్శిగా పున్న శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా నేరేళ్ల శ్రీనివాస్, తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పున్న లావణ్య సది, సంపత్, శంకర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

◆ వైభవంగా శోభాయాత్ర



సంగారెడ్డి టౌన్: అయోధ్య శ్రీరామ అక్షింతలు పట్టణంలోని మాధవసదన్ కు చేరుకున్నాయి. ఈ అక్షింతలను జిల్లాలోని మండల కేంద్రాలకు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాధవసదన్ లో అక్షింతలకు స్వామిజీలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక సంజీవని హనుమాన్ ఆలయం వరకు అక్షింతల కలశాలతో శోభాయాత్ర జరిపి ఆంజనేయ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్, దుద్యాల ఆశ్రమ పీఠాధి పతి అంబిక శివయోగి, తంగెడుపల్లి ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శివయోగి స్వామి, విశ్వానంద దత్తగిరి స్వామి, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పండరినాథ్ పాల్గొన్నారు.